
జిల్లా కేంద్రం రాఘవేంద్రకాలనీలో పూజలు చేస్తున్న భక్తులు


ఉప్పునుంతలలో..


తాడూరులో..


తెలకపల్లిలో..


కొల్లాపూర్‌లో..

అమ్మవారికి ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్‌: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహిస్తున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 7వ రోజు శనివారం బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో వాసవీమాత భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో భక్తులు పూజలు నిర్వహించారు. కల్వకుర్తిలో వాసవీకన్యకాపరమేశ్వరి దేవాలయంలో భక్తులకు ఆధ్యాత్మిక బోధనలు చేశారు. అమ్మవారిని శనివారం సంతాన లక్ష్మీదేవి రూపంలో అలంకరించారు. తాడూరులో లలితాత్రిపురసుందరిదేవి రూపంలో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉప్పునుంతల మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో దుర్గామాతను రాజరాజేశ్వరి రూపంలో అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. తెలకపల్లిలో దుర్గామాతా లలితాత్రిపురసుందరిదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. ఊర్కొండ మండలంలోని మాధారంలో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శనివారం మహాచండి అవతారంలో దర్శనమిచ్చారు. కొల్లాపూర్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కన్యకా మాతగా అలంకరించి పూజలు చేశారు. వెల్దండ మండల కేంద్రంలో లలితా త్రిపురసుందరిదేవిగా అలంకరించారు.

క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి

కల్వకుర్తి టౌన్‌: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పట్టణ ప్రజలు ఫ్లెక్సీల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. దసరా పండుగ సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే వారు విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ఉండకుండా, రాజకీయాలకు అతీతంగా పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన సిబ్బంది పైలెట్ కురుమూర్తి, ఈఎంటి గణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లికి చెందిన అర్జున్ శనివారం ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి నుంచి గగ్గలపల్లికి బైక్‌పై వెళ్తుండగా మండలంలోని రాకొండ సమీపంలో ఓ చెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో అర్జున్ ముఖానికి గాయాలయ్యాయి. 108 వాహనంలో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెంచులకు ప్రత్యేక వైద్య శిబిరం

ఉప్పునుంతల: మండలంలోని సీబీతండాలో శనివారం మన్ననూర్ ఐటీడీఏ, వైద్య ఆరోగ్యశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో చెంచుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. చెంచులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు.

వైఎస్సార్‌టీపీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

చారకొండ: మండలంలోని జూపల్లికి చెందిన కమాలోద్దీన్ వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడిగా పార్టీలో కొనసాగుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని శనివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయం అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను కలిసి వివరించారు. అభ్యర్థిత్వంపై పార్టీ కార్యాలయంలో దరఖాస్తును అధికార ప్రతినిధి లింగారెడ్డికి అందజేశారు.

కొల్లాపూర్ చేరిన ఈవీఎం యంత్రాలు



కొల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలు శనివారం నియోజకవర్గానికి చేరుకున్నాయి. వాటిని ప్రభుత్వ పీజీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలో రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్ సమక్షంలో భద్రపర్చారు. 269 బూత్‌లకు సంబంధించి ఈవీఎంలతో పాటు రిజర్వులో సిద్ధంగా ఉంచారు. మొత్తం 336 ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు.

కొనసాగుతున్న గ్రామసభలు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో సామాజిక తనిఖీ బృందం గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎస్ఆర్‌పీ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో చేపట్టిన ఉపాధి పనులకు ఖర్చు చేసిన వివరాలు, రికార్డులపై అవగాహన కల్పించారు. వారం రోజుల్లో బహిరంగసభ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామన్నారు.

వ్యక్తిపై కేసు

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లితండాకు చెందిన పాత్లావత్ శంకర్ శనివారం ఉదయం సారాను తరలిస్తూ కాంసానిపల్లి సమీపంలో పట్టుబడినట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లయ్య తెలిపారు. అతని వద్ద నుంచి ఆరు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తెగుళ్లతో రైతుల దిగాలు

- మిర్చి, పత్తి, వరికి వైరస్
- ఆందోళనలో రైతులు

తాడూరు: అధిక పెట్టుబడులు పెట్టి వాణిజ్య పంటలను సాగుచేస్తున్న రైతులకు తెగుళ్లు పట్టి పీడిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఆరుకాలం కష్టించి సాగు చేసుకున్న పంటలకు పూత వచ్చే సమయంలో పలు రకాల వైరస్‌లు సోకడంతో అనేక మందులు వాడి పెట్టుబడులు అధికమై దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ 16,178 ఎకరాలలో పత్తి, 7,924 ఎకరాలలో వరి, 3,377 ఎకరాలలో మిరప పంటలు సాగు చేశారు. ప్రస్తుతం పత్తి పూత, కాయ దశలో ఉన్న ఈ సమయంలో పత్తికి పచ్చదోమ, తెల్లదోమ పట్టి పీడిస్తుంది. మిరపలో కూడ తెల్లదోమ ఉధృతి ఎక్కువగా ఉండడంతో జమిని వైరస్ సోకుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వైరస్ సోకితే నివారణకు మందులు వాడినా పనిచేయవని మొక్కలను రైతులు తెంచివేస్తూ దిగాలు చెందుతున్నారు.

రైతుల ఆందోళన

ఎండుతెగుళ్లు, ఆకుముడత, వేరు, కాండంకుళ్లు, లార్వ తదితర వైరస్‌లు పలు రకాల పంటలకు సోకడంతో రైతులు ఏ మందు పిచికారి చేయాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. ఈ వైరస్‌ల కారణంగా పంటలో ఆకులు తెల్లటి ధారలుగా మారుతాయి. దీంతో దిగుబడులు తగ్గి, పెట్టుబడులు రావేమోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. మండలంలో పత్తి, వరి, మిరప సాగు ఎక్కువగా ఉంటుంది. వైరస్‌ల నివారణకు అనేక మందులు తీసుకువచ్చి పంటలకు పిచికారి చేయడంతో పెట్టుబడులు ఎక్కువవుతున్నాయని రైతులు నిరాశకు గురి అవుతున్నారు.


పంటపై అవగాహన కలిపిస్తున్న కేవికే శాస్త్రవేత్తలు (ఫైల్)

నివారణకు చర్యలు

రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటలకు ఏ మందులు వాడితే తెగుళ్ల నుంచి పంటను రక్షించుకోవచ్చు. పత్తిలో పచ్చదోమ నివారణకు ఏపీపెట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి భూప్రోపిజన్ 0.5 గ్రాములకు లీటర్ నీటిని కలిపి పిచికారి చేయాలి. తెల్లదోమ నివారణకు ఎకరానికి 10 పసుపురంగు జిగురు అట్టలు అమర్చుకుంటే ఒకసారి పురుగుమందు ఖర్చు తగ్గుతుంది. డైపిసిక్యూరాన్ 1.25 గ్రాములు లీటర్ నీరు కలిపి పిచికారి చేయాలి. మిరపలో తెల్లదోమ ఎక్కువగా ఉండడం వలన జెమిని వైరస్ వస్తుంది. నివారణకు పంటలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి. వైరస్ సోకిన మొక్కలను పీకి దూరంగా పడేయ్యాలి. సిఫారస్ మేరకు రసాయనిక మందులు వాడాలి. తెల్లదోమ నివారణకు పసుపు రంగు జిగురు అట్టలు ఎకరానికి 15 నుంచి 20 పెట్టాలి. వేపనూనె 1.500, టీపీఎంసీ ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి.

సూచించిన మందులు వాడాలి

మండలంలో అన్ని గ్రామాలలో రైతులు సాగుచేసిన పత్తి, మిరప, వరి పంటలకు వైరస్ సోకిందన్న సమాచారం ఉంది. మిరప పంటకు రైతులు డ్రిప్ ద్వారా వేరు, కాండం తడిసేంత వరకు నీరు నిల్వ ఉండే విధంగా చూడాలి. తాము ఇచ్చిన సలహాలు, సూచనల మేరకు మందులు వాడాలి.

– సాయిరమేష్‌గౌడ్, ఏఓ

బతుకమ్మ ఆడిన ప్రజాప్రతినిధులు


కల్వకుర్తిలో బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే


కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. శనివారం భవనంపై బతుకమ్మను పూలతో పేర్చి, మెప్మా సిబ్బందితో పాటు, మున్సిపల్ ఉద్యోగులు ఆడి, పాడారు. కార్యక్రమంలో కమిషనర్ రాజయ్యతో పాటు సిబ్బంది ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం సాయంత్రం వార్డు కౌన్సిలర్ మంజుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎడ్మ సత్యం, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మను తలపై ఎత్తి నిమజ్జనానికి తరలించారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

కొల్లాపూర్: మండలంలోని కుడికిళ్లకి చెందిన పలువురు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్‌రావు, బంగారయ్య తదితరులు న్నారు.

ఇంటింటా ప్రచారం

తాడూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని బలాన్‌పల్లి, లచ్చిరాంతండా, మేడిపూరు, పాల్మూరు, అల్లాపూర్‌లో ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో గౌరికుమార్, నరేష్‌లు మాట్లాడుతూ మర్రిజనార్దన్‌రెడ్డి ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ ప్రచారాన్ని సాగించారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

అసంపూర్తిగా తహసీల్దార్ కార్యాలయం


పిల్లర్ల దశలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం (ఫైల్)

- అద్దెభవనంలో కొనసాగుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

పెద్దకొత్తపల్లి: మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. 30ఏళ్లుగా అద్దె భవనంలోనే కార్యాలయం కొనసాగుతుంది. మండలంలోని అన్ని ప్రభుత్వం కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. కానీ తహసీల్దార్ కార్యాలయం మాత్రం ఇరుకు గదుల్లోనే కొనసాగుతుంది.

పిల్లర్ దశలోనే..

తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే బీరంహర్షవర్ధన్‌రెడ్డి రూ.1.70కోట్లు నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం పాత పోలీసు స్టేషన్ భవన నిర్మాణాన్ని తొలగించి కొత్త తహసీల్దార్ భవన నిర్మాణ పనులు పిల్లర్ దశలో కొనసాగుతున్నాయి. ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయితే ప్రజల కష్టాలు తీరుతాయి.

భవానిమాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

బల్మూర్: మండలంలోని చెన్నారంలో భవానిమాత పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులతో కలిసి ఆట, పాట కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల ఉన్నత పాఠశాలలో 2006–07 పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం ఉన్నత పాఠశాల ఆవరణలో సమావేశమై అప్పటి ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, శంకర్, రవి, శివకుమార్, ఆనంద్, కిరణ్‌కుమార్‌రెడ్డి, వాణి, ప్రసన్న, నరహరిగౌడ్, తిరుపతయ్యగౌడ్‌ను పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో శంకర్, లింగస్వామి, మధు, కృష్ణ, లింగం, హలీం తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చోరీ

బల్మూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. శనివారం హెచ్ఎంలు రాంసింగ్, ఇంద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో రాత్రి మూడు తరగతి గదుల తాళాలు విరగొట్టి అందులో ఆరు బెంచీలను అపహరించడంతో పాటు బోరు మోటార్ స్టార్టర్‌ను ధ్వంసం చేశారు. అదేవిధంగా పక్కనే ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యుత్ కేబుల్ వైర్‌ను అపహరించి, మద్యం బాటిళ్లను ఆవరణలో ధ్వంసం చేశారు. శనివారం ఇది గమనించిన స్వీపర్లు సమాచారం ఇవ్వడంతో హెచ్ఎంలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలీస్ అమరవీరులకు నివాళి



కొల్లాపూర్: పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కట్టా శ్రీనివాసులు, కాటం జంబులయ్యతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సమాజ రక్షణ కోసం పోలీసులు చేస్తున్న కృషిని కొనియాడారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లికి చెందిన బొజ్జయ్య ఇటీవల మృతి చెందాడు. శనివారం గౌడ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో రూ.10వేలు, చెర్యాకర్ కమిటీ ఆధ్వర్యంలో రూ.5వేల చొప్పున బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మట్ట వెంకటయ్యగౌడ్, కొమ్మగోని వెంకటయ్యగౌడ్, భీమయ్యగౌడ్, మదన్‌గౌడ్ ఉన్నారు.

బీఎస్పీతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు


తెలకపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

తెలకపల్లి: బీఎస్పీతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని నాయకులు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా కొత్తపల్లి కుమార్ బరిలో ఉన్నారని ఆయనను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, ఇచ్చిన మాట తప్పిందని అన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు సుపరిపాలన అందాలంటే, దళిత బహుజనులకు రాజ్యం దక్కాలంటే బీఎస్పీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శివశంకర్, సృజన తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలను విస్మరించడం సరికాదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీలో కేవలం అగ్రవర్ణాలే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు ఉన్నారని బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శనివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన ఇతర కులాల నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పార్టీ కొరకు నిరంతరం పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను విస్మరించటం సరికాదన్నారు. ఇన్ని రోజులు పార్టీకి పని చేస్తున్న వారిని విడిచిపెట్టి కొత్తగా వచ్చిన వారే పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరెడ్డి దృష్టిసారించి పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గోపాల్, సైదులు, దాస్య పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులపై ప్రశ్నించండి


తిమ్మాజిపేటలో మాట్లాడుతున్న రాజేష్‌రెడ్డి

బిజినేపల్లి: ఎమ్మెల్యేగా మరో సారి గెలిపించాలని ఓట్ల కోసం వచ్చే నాయకుల్ని తొమ్మిదేళ్లుగా ఇవ్వని కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు ఇస్తారని అడగాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుచుకూళ్ల రాజేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం తిమ్మాజిపేట మండలంలోని బుద్ద సముద్రంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలో కొత్త ఫించన్లు ఒక్కసారి మాత్రమే మంజూరు చేశారని, గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు ఎప్పుడు మంజూరు చేస్తారో ప్రశ్నించాలన్నారు. వాటికి సంబంధించిన డబ్బులు ఖాతాల్లో ఎప్పుడు వేస్తారో చెప్పాలన్నారు. ఉప సర్పంచ్ రాణమ్మ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు.

యూత్ కాంగ్రెస్ నాయకుల సస్పెండ్

కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి, వీపనగండ్ల మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గులాం రసూల్, పాము రాజశేఖర్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాము, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్‌లు శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, సోషల్‌మీడియా, ఇతర సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేయడంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లి, మరికల్ చెందిన పలువురు శనివారం మాజీమంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారికి జూపల్లి కృష్ణారావు కండువాలు కప్పారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, చంద్రయ్యయాదవ్ పలువురు ఉన్నారు.

మన్ననూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చుతుందని అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు అన్నారు. శనివారం మన్ననూర్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా మాట్లాడారు. ఎమ్మెల్యేగా వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఎన్నికల్లో బీజేపీకి అవకాశం ఇవ్వండి


వెల్దండలో కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆచారి

కొల్లాపూర్: ఒక్క అవకాశం ఇవ్వండి. అభివృద్ధి చేసి చూపిస్తా. మాట తప్పితే మీరు వేసే ఏ శిక్షకైనా సిద్ధం అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో యువ భరోసా కార్యక్రమం ఏర్పాటు చేశారు. యువతను ఉద్దేశించి మాట్లాడారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఏడాది లోపు పారిశ్రామిక జోన్ ఏర్పాటు చేయిస్తా అన్నారు. వంద కంపెనీలు పెట్టించి, 10 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. మాట తప్పితే ఏ శిక్షకైనా సిద్ధమని ప్రకటించారు.

వెల్దండ: మండలంలోని పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం బీజేపీ నాయకుడు ఆచారి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కల్వకుర్తి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. మండలంలోని బైరాపూర్ చెందిన 50మంది ఆచారి సమక్షంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, బాలస్వామి, రామస్వామి, శ్రీనివాసచారి, తదితరులు ఉన్నారు.

చారకొండ: కల్వకుర్తి నియోజకవర్గంలో దశాబ్దాలుగా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న తనకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని తల్లోజు ఆచారి అన్నారు. శనివారం మండలంలో దొడ్లపల్లి, జేపల్లి, గోకారం, చంద్రాయన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రజా సంక్షేమాన్ని విస్మరించారన్నారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, రామస్వామి, శ్రీనివాసాచారి, అంజన్ కుమార్, వెంకట్‌రాములు పాల్గొన్నారు.